

వాహనాల తనిఖీల్లో రూ.75 వేలు స్వాధీనం

ప్రజాశక్తి - గణపవరం


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం పిప్పరలోని జిఎస్ఆర్ స్కూల్ వద్ద నిడమర్రు సిఐ ఎంఇ.సుభాష్, గణపవరం ఎస్ఐ బి.వెంకటేశ్వరరావు వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో అత్తిలి నుండి పిప్పర వైపు వస్తున్న మారుతి కారులో ఎటువంటి పత్రాలూ లేని రూ.75 వేలు స్వాధీనం చేసుకున్నారు. నరసాపురం మండలం సీతారామపురం గ్రామానికి చెందిన ధర్మవరపు సూర్యనారాయణకు చెందిన వాహనం నుంచి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సుభాష్ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌టి అధికారి టిఎల్.సరస్వతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



'పింఛన్ల' రగడ..!

- ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పింఛన్ల పంపిణీకి వాలంటీర్లు దూరం
- ఎన్నికల స్టంట్‌గా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం
- రెండు జిల్లాల్లో 5.10 లక్షల మంది పింఛన్‌దారులు
- 3 నుంచి పంపిణీకి సన్నాహాలు.. ఎక్కడిస్తారనే దానిపై లేని స్పష్టత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాజిక పింఛన్ల పంపిణీపై నెలకొన్న సందిగ్ధత అధికార, ప్రతిపక్షపార్టీల మధ్య ఎన్నికల స్టంట్‌గా మారింది. పింఛన్ల పంపిణీకి వాలంటీర్లను దూరం పెట్టాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలు దీనికి కారణం. పింఛన్ల పంపిణీని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయంటూ వైసిపి విమర్శలు గుప్పిస్తుండగా, తాము అలా చేయలేదంటూ టిడిపి నేతలు తిప్పికొడుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఈ నెల పింఛన్ల పంపిణీ మూడో తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. అయితే ఇంటికి తెచ్చిస్తారా.. లేక పంచాయతీ కార్యాలయాల వద్దకు వెళ్లాలా అనే దానిపై ఇంకా స్పష్టత రాకపోవడంతో గందరగోళం నెలకొంది.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వృద్ధాప్య, చేనేత, వితంతు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఇలా 25 రకాలకు చెందిన 5.10 లక్షల మందికి ప్రతినెలా సామాజిక పింఛన్లను ప్రభుత్వం అందిస్తోంది. ఏలూరు జిల్లాలో 2.72 లక్షల మందికి రూ.152 కోట్లు, పశ్చిమగోదావరిలో 2.38 లక్షల మందికి రూ.69.97 కోట్లు సొమ్ము అందిస్తున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి 50 ఇళ్లకూ ఒక్కో వాలంటీర్‌ను నియమించింది. వీరే ప్రతినెలా ఇంటికి తెచ్చి పింఛన్‌దార్లకు సొమ్ము అందిస్తున్నారు. ఎన్నికల సమయంలో వాలంటీర్లు వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేశాయి. దీంతో వాలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా ఎన్నికల కోడ్ ముగిసే వరకూ పింఛన్ల పంపిణీకి వాలంటీర్లను దూరం పెట్టాలని ఎన్నికల కమిషన్ తెలిపింది. దీంతో సామాజిక పింఛన్ల పంపిణీ వ్యవహారం ఎన్నికల స్టంట్‌గా మారిపోయింది. వృద్ధులకు అందే పింఛన్ సొమ్మును టిడిపి, జనసేన, బిజెపి అడ్డుకున్నాయంటూ వైసిపి పెద్దఎత్తున ప్రచారం చేస్తోంది. అయితే పింఛన్ల పంపిణీని తాము అడ్డుకోలేదంటూ టిడిపి, మిత్రపక్షాలు అదేస్థాయిలో తిప్పికొడుతున్నాయి. మార్చి నెలాఖరుకు ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా సామాజిక పింఛన్ల పంపిణీ ఈ నెల మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకూ సాగుతుందని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఇంటికి తెచ్చిస్తారా.. పంచాయతీ కార్యాలయాల వద్దే పంపిణీ చేస్తారా అనేది ఇంకా స్పష్టత లేకుండాపోయింది. వాలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకూడదని, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవాలని తెలపడంపై పలుచోట్ల వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు సైతం దిగారు. పింఛన్ల వ్యవహారాన్ని వైసిపి ఎన్నికల ప్రచారాస్త్రంగా ఉపయోగించుకుంటుందని స్పష్టమవుతోంది. అదే సమయంలో సచివాలయ సిబ్బందితో పింఛన్ల సొమ్మును ఇంటికెళ్లి ఇచ్చే అవకాశమున్నా ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదనే చర్చ సైతం నెలకొంది. పింఛన్‌దారులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి తెగ ఆరాట పడుతున్న పరిస్థితి కన్పిస్తోంది.

కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా పింఛన్ల పంపిణీ

ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిఆర్‌డిఎ పీడీ, పశ్చిమగోదావరి జిల్లా

ఈ నెల మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకూ సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశాం. ఇంటింటికి వెళ్లి ఇవ్వడంపై ఇప్పటి వరకూ ఆదేశాలు రాలేదు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా పింఛన్ల పంపిణీ చేపడతాం.

ప్రచార వ్యయాన్ని పక్కాగా లెక్కించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్



ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి వివిధ రాజకీయ పార్టీల ప్రచార వ్యయాన్ని పక్కాగా లెక్కించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్యతో కలిసి జిల్లాస్థాయి ఎన్నికల వ్యయ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎలక్ట్రానిక్, ప్రింట్, కేబుల్ నెట్‌వర్, సోషల్ మీడియా, బహిరంగ సభలు, ర్యాలీలు ద్వారా ప్రచారాలు, స్టార్ క్యాంపెయినర్, హెలికాప్టర్ ఖర్చులు, పాంప్లెట్లు, పోస్టర్లు ప్రింటింగ్, వాహనాలు, వీడియో తదితర ఖర్చుల లెక్కింపుపై విపులంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వివిధ ప్రచార మార్గాలకు ఖర్చు చేసి మొత్తాలను గుర్తించి పక్కాగా లెక్కించి నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనుమతి లేనిదే రాజకీయ ప్రచారాలు ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించడానికి వీల్లేదన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతోపాటు, చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్), స్టార్ క్యాంపైనర్ల ప్రచారం, ఇతర ఉల్లంఘనలు కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్టర్ కాబడిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలుగానీ, వారి తరపున ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ రాజకీయ ప్రచార ప్రకటనలను ప్రసారం చేసేందుకు అనుమతి కోసం నిర్ణీత నమూనాలో మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ కానటువంటి రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు వారి ప్రకటన ప్రసారం చేయుటకు ఏడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోగా జిల్లాస్థాయి ఎంసిఎంసి కమిటీ అనుమతి మంజూరు చేస్తుందన్నారు. వార్తా పత్రికల్లో పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు తప్పనిసరిగా ఎంసిఎంసి నుండి అనుమతి పొందిన తర్వాతే ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి అన్ని రకాల టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, డిజిటల్ డిస్‌ప్లేలు, మొబైల్ నెట్‌వర్క్‌ల ద్వారా ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్‌లు వస్తాయని, అలాగే సామాజిక మాధ్యమాలైన (సోషల్ మీడియా) ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, గూగుల్ వెబ్‌సైట్స్ కూడా ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి వస్తాయని తెలిపారు. అలాగే సినిమా హాళ్లలోనూ, ప్రయివేట్ ఎఫ్ఎం రేడియోల్లో, ఎలక్ట్రానిక్ పత్రికలలోను, ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలు కూడా తప్పనిసరిగా ముందస్తు ధ్రువీకరణ పొందాల్సి ఉంటుందన్నారు. ధ్రువీకరణ లేకుండా ఎవరైనా ప్రకటనలు ఇస్తే ఎన్నికల సంఘం మార్గదర్శకాల నిబంధనల మేరకు సదరు ప్రకటనకు అయ్యే ఖర్చును సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుతఅంబరీష్, కె.చెన్నయ్య, ఆర్ఒలు బి.శివనారాయణరెడ్డి, వి.స్వామినాయుడు, జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారి పి.పాపారావు, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

ఓటు కోసం 14 లోపు దరఖాస్తు చేసుకోవాలి: కలెక్టర్

ఓటుహక్కు పొందేందుకు ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండినవారంతా అర్హులేనని, ప్రస్తుతానికి ఇదే చివరి అవకాశం అని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీలోపుగా దరఖాస్తు చేసుకోగలిగితే, త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఆ తర్వాత దరఖాస్తు చేసినా, ఈ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం ఉండదని పేర్కొన్నారు. కొత్త ఓటు కోసం, లేదా చిరునామా మార్పు కోసం ఈ నెల 14వ తేదీలోపు వచ్చే దరఖాస్తులను మాత్రమే పరిశీలిస్తామని తెలిపారు. వాటిని పది రోజుల్లోగా పరిశీలించి, అర్హతుంటే ఓటర్ల జాబితాలో చేర్చుతామని పేర్కొన్నారు. ఏప్రిల్ 14 తర్వాత వచ్చే దరఖాస్తులను మాత్రం ఎన్నికల తరువాత మాత్రమే పరిశీలిస్తామని స్పష్టం చేశారు. మార్చి 30 నాటికి జిల్లాలో సుమారు 14,61337 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. కొత్త ఓటర్ల చేర్పింపు కొనసాగుతుండంతో ఓటర్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోందని తెలిపారు. ఎవరికైనా తమ ఓటుపై సందేహం ఉంటే ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఓటర్ల జాబితాల్లో తమ పేరును ఆన్‌లైన్ ద్వారా చూసుకోవచ్చని పేర్కొన్నారు. బిఎల్ఒల వద్ద ఉన్న ఓటర్ల జాబితాలో కూడా తమపేరు తనిఖీ చేసుకోవచ్చని తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ఫోన్ నెంబర్లు 08816-299616, 08816-299617లకు ఫోన్ చేసి సంప్రదించి తమ ఓటు వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు.

ఓటుహక్కు ఆయుధం

స్వీప్ జిల్లా నోడల్ అధికారి ప్రభాకర్


మాట్లాడుతున్న జిల్లా స్వీప్ నోడల్ అధికారి ప్రభాకర్

ప్రజాశక్తి - భీమవరం

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఒక ఆయుధం అని, ఎలాంటి ప్రలోభాలకూ గురికాకుండా ఓటుహక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి జిసిహెచ్.ప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో ఓటుహక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఓటుహక్కు వినియోగించుకోవడం మన బాధ్యతని, ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం వంటిదని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకూ గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలందరూ ఓటు హక్కును నిబద్ధతతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంచి పౌరులను ఓటు ద్వారా ఎన్నుకుని దేశ భవిష్యత్తును కాపాడాలన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు మంచి విలువ ఉందని, ఎటువంటి ప్రలోభాలకూ గురికాకుండా సక్రమ పద్ధతిలో ఓటు వినియోగించుకోవాలన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కళాజాతా బృందం ద్వారా ఓటు హక్కుపై బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకట్రామన్, ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి, ఆర్‌టిసి, మెప్మా సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కామన మునిస్వామి



ప్రజాశక్తి - తణుకు రూరల్

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కామన మునిస్వామి ఎన్నికయ్యారు. ఆదివారం ఏలూరులో జరిగిన ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఈ ఎన్నికల జరిగింది. తనను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రాష్ట్ర కమిటీ ఎన్నుకుందని కామన మునిస్వామి తెలిపారు.

సంస్కృతీ సంప్రదాయాలకు వేదిక పండుగలే

9న భీమవరంలో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు పండుగలే పట్టుగొమ్మలని సివి.రామన్ స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత అన్నారు. సోమవారం శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉగాది వేడుకల్లో భాగంగా విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సరిత మాట్లాడుతూ 35 ఏళ్లుగా ఉగాది వేడుకలను నిర్వహించడం స్ఫూర్తిదాయకమని, కనుమరుగైపోతున్న మన సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి, మన తెలుగు భాష, ఉగాది ఔన్నత్యంపై కళాశాల, పాఠశాలల్లో సదస్సులు, విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 9న జరిగే ఉగాది వేడుకల్లో విజేతలకు బహుమతులు, జిల్లాస్థాయిలో సేవాతత్పరులకు అవార్డులు అందిస్తామన్నారు. అనంతరం 72 మంది విద్యార్థులకు వేమన, సుమతి, దాశరథి శతకాల్లోని పద్యాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పిఎస్ఎం గరల్స్ హైస్కూల్ హెచ్ఎం సుధారాణి, భవాని, పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మెండిలో వైసిపి రంగులతో ఓవర్ హెడ్ ట్యాంక్


సీసలిలో తాగునీటి వాటర్‌ట్యాంకుపై జనసేన రంగులు, నాయకుల ఫొటోలు

ఎన్నికల కోడ్ పట్టదా..!

ప్రజాశక్తి - కాళ్ల

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి రోజులు గడుస్తున్నప్పటికీ పలు ప్రాంతాల్లో వైసిపి, జనసేన పార్టీల రంగులతో దర్శనమిస్తున్నాయి. మెండి ప్రాంతంలో ఓవర్ హెడ్ ట్యాంకర్ వైసిపి రంగుల్లో కనిపిస్తుంది. సీసలి గ్రామంలో తాగునీటి ట్యాంకర్‌పై జనసేన పార్టీ రంగులతో పాటు పవన్‌కళ్యాణ్, రాజకీయనాయకుల చిత్రాలు ఉన్నాయి. రంగులు, ఫొటోలు తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినప్పటికీ ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకోలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య ధోరణి సరికాదని పలువురు పేర్కొంటున్నారు.

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా పటిష్ట ప్రణాళిక

కలెక్టర్ సుమిత్‌కుమార్


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, జెసి ప్రవీణ్‌ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో తీర ప్రాంతం, లంక గ్రామాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డికి తెలిపారు. వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, విద్యుత్ సరఫరా, తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి చెరువులను, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను, మంచినీటి చెరువులను కాల్వలు కట్టేసేలోగా పూర్తిస్థాయిలో నింపుకోవాలన్నారు. వేసవికాలంలో తాగునీటి సరఫరాకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్ మాధుర్, డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు, జిల్లా పంచాయతీ శాఖాధికారి ఆర్.విక్టర్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బివివి.నాగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఇఇ ఫీర్‌అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

ఇసిఆర్‌డిఎఫ్ రాష్ట్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నరసింహరాజు



ప్రజాశక్తి - నరసాపురం

పర్యావరణ, పౌర హక్కుల రక్షణ సామాజిక సంక్షేమ ఫౌండేషన్ రాష్ట్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా మండలంలోని పెదమైనవానిలంక గ్రామానికి చెందిన తిరుమాని నరసింహరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ అధినేత వెంకట విశ్వనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మానవుడి జీవితంలో ఎంతో విలువైందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అనేక కార్యక్రమాలను నిర్వహించామని, భవిష్యత్తులో గాలి, నీరు కలుషితం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. పలు గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి అందరికీ మెరుగైన వైద్యం అందించామని చెప్పారు. సమాజంలో ప్రతిఒక్కరికీ రాజ్యాంగం పౌరహక్కులను కల్పించిందని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సంస్థ తనకిచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పర్యావరణ పరిరక్షణ, పౌరహక్కుల రక్షణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రెసిడెంట్‌గా నియమితులైన సందర్భంగా ఆయన స్నేహితులు, కుటుంబ సభ్యులు, పలు సేవా సంస్థ ప్రతినిధులు, అభినందనలు తెలిపారు.

పిప్పరలో 21 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని పిప్పర ఒకటో సచివాలయానికి చెందిన పది మంది వాలంటీర్లు, రెండో సచివాలయానికి చెందిన 11 మంది వాలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మీడియాకు ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు తమ సేవలు అవసరం లేదని చెప్పారని తెలిపారు. తాము 21 మంది రాజీనామా చేసి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు వాలంటీర్లకు చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. ఈ విషయంపై స్థానిక ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.సూర్యనారాయణను వివరణ అడిగితే వాలంటీర్లు రాజీనామా చేసిన విషయం తమకు తెలియదని చెప్పారు.

వేతనాలు పెంచాలని కార్మికుల ధర్నా



ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలోని ఫుడ్ ఫ్యాట్స్, ఫెర్టిలైజర్స్ (త్రీఎఫ్) ఇండస్ట్రీలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు నాయకులు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులు ఫ్యాక్టరీ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ త్రీఎఫ్ ఇండస్ట్రీలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు పెంచి ఐదేళ్లు అయిందని, వేతన ఒప్పందం పూర్తయి సంవత్సరం అవుతున్నప్పటికీ యాజమాన్యం చర్చల పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. త్రీఎఫ్ యాజమాన్యం దిగి వచ్చి వెంటనే కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో త్రీఎఫ్ ఇండస్ట్రీ కార్మిక నాయకులు టి.గణేశ్వరరావు, పెనుమాక శ్రీను, మాకా శ్రీనివాస్, కనకరాజు పాల్గొన్నారు.

నరసాపురం పార్టీలో సమస్యలు పరిష్కరిస్తా

నారా లోకేష్ హామీ : తెలిపిన మాజీ ఎంఎల్ఎ బండారు


నారా లోకేష్‌తో బండారు మాధవనాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలు తన దృష్టిలో ఉన్నాయని, త్వరలోనే వాటిని పరిష్కరిస్తానని నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు తెలిపారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు తన అభిమానులతో కలిసి విజయవాడ తరలివెళ్లి లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ మాధవనాయుడు తన సొంత మనిషి అని, మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడని అన్నట్లు చెప్పారు. గత ఐదేళ్లుగా ప్రజా సమస్యలపై పోరాడుతూ అనేక కేసులు పెట్టినా ఎక్కడా బెదరకుండా ప్రతిపక్ష నాయకుడిగా రాణించారన్నారని చెప్పారు. మాధవనాయుడును పార్టీ ఎప్పుడూ విస్మరించదన్నారని తెలిపారు. తగిన గుర్తింపు పార్టీ నుంచి ఇస్తామని చెప్పారని తెలిపారు. వైసిపి నిరంకుశ ప్రభుత్వాన్ని తరిమి కొట్టి, జగన్‌కు బుద్ధి చెప్పాల్సిన తరుణమిదని, నరసాపురం నియోజకవర్గంలో జనసేన ఎంఎల్ఎ అభ్యర్థిని అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారని తెలిపారు. స్థానిక సమస్యలు, రాజకీయ పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారన్నారు. మాధవనాయుడుతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి చిటికెల రామ్మోహనరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కుక్కల మీరయ్య, బండారు పటేల్‌నాయుడు, ఆంద్రాజు రామన్న, కొట్టు పండు, తంగెళ్ల నాగేశ్వరరావు, చెంపాటి సత్యనారాయణరాజు, రేవు ప్రభుదాసు, వాతాడి కృష్ణ, ఈదా సురేష్, శింగంశెట్టి తాతాజీ, కొండేటి శ్రీను, కుమ్మరిపురుగు తాతాజీ, రాంబాబు, కూనపరెడ్డి గోవిందరావు, మంద్రు హేమలత, పులపర్తి త్రిమూర్తులు పాల్గొన్నారు.

మానవ విలువలతోనే సమాజాభివృద్ధి

ఎస్ఆర్‌కెఆర్ డైరెక్టర్ జగపతిరాజు, ప్రిన్సిపల్ మురళీకృష్ణంరాజు

కళాశాలలో ముగిసిన జీవన విద్య శిక్షణ శిబిరం


శిబిరంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు


ప్రజాశక్తి - భీమవరం రూరల్

మానవ విలువలతోనే సమాజ అభివృద్ధి, వ్యక్తిగత సౌశీల్యం సాధ్యమని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు తెలిపారు. కళాశాలలో మూడు రోజుల పాటు జీవన విద్య శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు, కళాశాలలో పనిచేసే అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణంరాజు, డాక్టర్ జగపతిరాజు మాట్లాడుతూ మానవ విలువలతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో కూడా హ్యూమన్ వాల్యూస్ ప్రాముఖ్యతను గుర్తించి ఎఐసిటిఇ కూడా ఇంజినీరింగ్ సిలబస్‌లో హ్యూమన్ వాల్యూస్ కోర్స్‌ను చేర్చినట్లు చెప్పారు. మనిషి ఆనందంగా జీవించడానికి కావాల్సిన ముఖ్యమైన విషయాలను చాలా సులభంగా అర్థమయ్యే రీతిలో వక్తలు శివశంకర్, శ్రీదేవి, బాల రమేష్ వివరించారు. వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి వ్యక్తిగత కుటుంబంలో, చుట్టూ ఉన్నవారితో సంబంధాలను మరింత అర్థం చేసుకుంటూ, ఆత్మీయంగా, ఆనందంగా జీవించాలన్నారు. సమాజంలో భాగస్వామ్యులవ్వాలన్నారు. ప్రకృతితో మమేకమై జీవించడం ఎలాగో అనేక విషయాలు మనం తెలుసుకోలేక, అవగాహన లేక రోజు వారి జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. శిబిరంలో పలువురు మాట్లాడుతూ విద్య, పూర్తిగా అవగాహన లేక జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, దీనిని ఆచరించడం వల్ల కొంత ఆనందంగా జీవించే అవకాశం ఉందనే స్పష్టత వచ్చిందని చెప్పారు. ఈ శిబిరం సెంటర్ ఫర్ హోలీస్టిక్ డెవలప్‌మెంట్ హ్యూమన్ కాన్షియస్నెస్ సంస్థ సహకారంతో నిర్వహించినట్లు కో-ఆర్డినేటర్ ఇంజినీరింగ్ కెమిస్ట్రీ హెడ్ డాక్టర్ పి.భవాని, పి.రమేష్‌రాజు తెలిపారు.

పాలమూరులో వెంకన్న శతజయంతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

అత్యంత నిరుపేద కుటుంబంలో పుట్టి, స్వశక్తి, అంబేద్కర్ భావజాలం ప్రేరణతో ఎదిగిన మహోన్నతుడు పరువు వెంకన్న అని సమత ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బి.సంపత్‌రావు అన్నారు. వెంకన్న శతజయంతి కార్యక్రమాన్ని మండలంలోని పాలమూరు గ్రామంలోని అంబేద్కర్ నగర్‌లో విశ్రాంత ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజినీర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహ దాత గొల్ల రామకృష్ణను ట్రస్ట్ వారు సన్మానించారు. సమాజానికి వెంకన్న చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వివేక్, బి.సూర్యప్రకాశరావు, సుదర్శన్, దిద్దే బుజ్జి, పంతల మోహనరావు, బి.వెంకట్రావు పాల్గొన్నారు.


వెంకన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న వక్తలు

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తణుకు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సంక్షేమ పథకాలన్నీ గడప వద్దకే చేరుతున్నాయని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటిస్తూ కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అడ్డుకునే నాయకులను ఈ ఎన్నికల్లో ఓడించాలన్నారు. అభివృద్ధికి కృషి చేసే నాయకులను గుర్తించాలన్నారు. జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - నరసాపురం

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నూలి శ్రీనివాస్ నాలుగో పర్యాయం బాధ్యతలు చేపట్టారు. పాలకొల్లు గామాస్ కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముక్కాల ద్వారకనాథ్, విశిష్ట అతిథి శ్రీకొల్లాపు శివరామ సుబ్రహ్మణ్యం, మాజీ ఎంఎల్ఎ బంగారు ఉషారాణి సమక్షంలో నూలి శ్రీనివాస్ ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. సుదీర్ఘకాలం నుంచి నరసాపురం బిబిజిస్ మహిళా కళాశాల, సర్వశిక్ష సాంస్కృతిక ఉన్నత పాఠశాలల సెక్రటరీ, కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. అభయ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యోగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా కూడా ఉన్నారు. ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నూలి శ్రీనివాస్‌కు పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, నాయకులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

వైసిపితోనే ప్రజా శ్రేయస్సు : చీఫ్ విప్ ముదునూరి

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా శ్రేయస్సు వైసిపితోనే సాధ్యమని ఆ పార్టీ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి పంచాయతీ పరిధి చింతరేవులో ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం ఎన్నికల ప్రచారాన్ని ఎన్నికల పరిశీలకులు వేండ్ర వెంకటస్వామి, ప్రసాదరాజు తనయుడు శ్రీకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామానికి చెందిన తిరుమణి ఏడుకొండలుతో పాటు పలువురు పార్టీలో చేరారు. వారికి ప్రసాదరాజు పార్టీ కండువా కప్పి సాదారంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమని నాగరాజు, నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ, నాయకులు రేవు రాంబాబు, నారాయణమూర్తి, కుక్కల కృష్ణమోహన్, కడలి మధుసూదన్, పాల రాంబాబు, తిరుమని లక్ష్మీనరసింహం, పడవల సత్యనారాయణ, కడలి సోంబాబు, అంద్రాజు చల్లారావు పాల్గొన్నారు.


ప్రచారంలో ముదునూరి ప్రసాదరాజు

ప్రజా సంక్షేమానికి అడ్డంకిగా చంద్రబాబు

ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాధరాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు అడుగడుగునా అడ్డంకిగా మారారని వైసిపి ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాధరాజు విమర్శించారు. మండల కేంద్రం పెనుమంట్రలో 18వ రోజు సోమవారం ఎన్నికల శంఖారావం పాదయాత్రలో ఆయన పాల్గొని ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు చేసి జగన్‌కు అండగా నిలవాలన్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన కాపు, శెట్టిబలిజ సంఘాలకు చెందిన పలువురు వైసిపిలో చేరారు. వారికి శ్రీరంగనాధరాజు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి పాల్గొన్నారు.


ప్రచారంలో చెరుకువాడ శ్రీరంగనాధరాజు

పెన్షన్ల పంపిణీలో ఇబ్బందులు తగవు

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

వృద్ధులు, వికలాంగులు, వితంతు మహిళలకు పంపిణీ చేసే పెన్షన్ల వ్యవహారంలో సిఎం జగన్ రాజకీయ లబ్ధితో మూర్ఖత్వంగా వ్యవహరిస్తున్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఆయన సోమవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పెన్షన్ సొమ్మును సచివాలయాల్లో పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెప్పడం వృద్ధులు, వికలాంగులు, వితంతు మహిళలను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడమేనన్నారు. ప్రభుత్వ అధికారులు మురళీధర్ రెడ్డి, జవహర్ రెడ్డి ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

పెన్షన్లు అందించాలి

నరసాపురం : సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఫింఛన్లు ఇంటికి చేర్చేందుకు వైసిపి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి డిమాండ్ చేశారు రాయిపేటలో ఆమె నివాసంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. పెన్షనర్లకు ఇవ్వాల్సిన డబ్బును ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు జగన్ దోచిపెట్టడం వల్ల పింఛన్ల సొమ్ము ఇవ్వడానికి నేడు ఖజానాలో సరిపడా నిధులు లేవన్నరు. అది కప్పిపుచ్చుకోవడానికి ఎన్నికల కమిషన్‌పై, నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌పై, టిడిపిపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వైసిపి స్వార్థ రాజకీయం వల్లే ఫించన్ దారులు, వాలంటీర్లు నష్టపోతున్నారన్నారు.

ప్రజల కోసమే కూటమిగా బరిలోకి

జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర ప్రజల బాగు కోసమే కూటమిగా బరిలోకి దిగుతున్నామని జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి శ్రీనివాస్,తోట గోపీ సమక్షంలో వైసిపి నేత ఉంగరాల శ్రీనివాసరావు సోమవారం జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఉంగరాల శ్రీనివాస్‌కు బొలిశెట్టి శ్రీనివాస్ జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన అంతిమ దశకు చేరుకుందన్నారు. ఆ పార్టీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ తోట గోపీ, జనసేన పట్టణ అధ్యక్షుడు వర్ధనపల్లికాశి, పైబోయిన రఘు, దాగారపు నాగు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సజ్జాపురంలో ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి ప్రచారం

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవడానికి మహిళలందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. పట్టణంలోని సజ్జాపురం నుంచి ఆమె సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. రాధాకృష్ణను గెలిపించాలని కోరుతూ 30వ వార్డులో ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో టిడిపి, జనసేన నాయకులు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - ఉండి

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించి ఆక్వా పంటకు వంద కౌంట్‌కి కనీసం రూ.300 ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల కమిటీ సమావేశం ప్రజా సంఘాల కార్యాలయంలో మండల ఉపాధ్యక్షులు దండు రామలింగరాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరేరామ్ మాట్లాడుతూ ఆక్వా పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పంట పండించే నాథుడే లేక ఆక్వా చెరువులన్నీ ఖాళీగా ఉన్నాయన్నారు. గతంలో రూ.1.40 లక్షలు లీజు ఉన్న చెరువులు ప్రస్తుతం రూ.60 వేలు పలకడం దారుణమన్నారు. దీనికి కారణం ప్రభుత్వ విధానాలేనన్నారు. మేత ధరలు, మందుల ధరలు విపరీతంగా పెరగటం వల్ల ఉత్పత్తి ఖర్చు పెరుగుతుందన్నారు. కరెంటు, డీజిల్ ధర కూడా విపరీతంగా పెరగడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కిలారి తవిటి నాయుడు, నక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'వైసిపి నాయకుల ఆరోపణలన్నీ అసత్యాలు'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వైసిపి నాయకులు టిడిపిపై చేస్తున్న ఆరోపణలన్నీ అసత్యాలని టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ పంపిణీ సచివాలయ ఉద్యోగుల ద్వారా ప్రజలకు పంపిణీ చేయాలని టిడిపి అధినేత చంద్రబాబు సూచించారన్నారు. రూ.200 ఉండే పెన్షన్‌ను రూ.రెండు వేల వరకు పెంచిన ఘనత టిడిపిదేనన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే రూ.నాలుగు వేలు ఇస్తామని చెప్పారు. 50 ఏళ్లు నిండిన బిసి మహిళలకు రూ.నాలుగు వేలు ఫించన్ ఇవ్వడానికి హామీ ఇచ్చారన్నారు. వైసిపి ప్రభుత్వం ఎప్పుడూ ఇతరులపై బురద చల్లడం, వికృత చేష్టలు చేయడమే పనిగా పెట్టుకుందన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పెంటపాడు మండలాధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, షేక్ బాజి, ముప్పిడి రమేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షన్లు అందక వృద్ధుల ఇబ్బందులు

ప్రజాశక్తి - గణపవరం

ప్రతినెలా ఒకటో తేదీన వృద్ధులకు ఇచ్చే పెన్షన్ ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిపల్లి మంగరాజు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలకు అనేక సేవలందిస్తున్న వాలంటీర్ వ్యవస్థ వల్ల ప్రజలకు అన్యాయం జరుగుతుందని చంద్రబాబు తన అనుచరుడుగా ఉన్న నిమ్మగడ్డరమేష్‌కుమార్ తో ఎన్నికల కమిషనర్‌కి ఫిర్యాదు చేయించారన్నారు. చంద్రబాబుతో పాటు పవన్‌కళ్యాణ్ కూడా వాలంటీర్లను దూషించారన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం

జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యమని జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక 35వ వార్డులో జనసేన, టిడిపి, బిజెపి ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ జగన్ అసమర్థ, అవినీతి పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లే బాధ్యత కూటమి తీసుకుంటుందన్నారు. బిజెపి రాష్ట్ర నాయకులు పాకా సత్యనారాయణ, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు మాట్లాడారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, చెన్నమల చంద్రశేఖర్, జెడ్‌పిటిసి సభ్యులు గుండా జయప్రకాష్, వేగేశ్న కనకరాజు సూరి, మల్లినిడి తిరుమలరావు, బండి రమేష్‌కుమార్, వానపల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

'ప్రజలను ఇబ్బంది పెడుతున్న టిడిపి'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టిడిపి కూటమి రాష్ట్ర ప్రజలను ఇబ్బందులు పెట్టేందుకు చూస్తుందని ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ (క్యాబినెట్ హోదా) వడ్డీ రఘురామ్‌నాయుడు అన్నారు. తాడేపల్లిగూడెంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వృద్ధులను, వికలాంగులను ఇబ్బందులు పెట్టేవిధంగా టిడిపి చూస్తుందన్నారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - మొగల్తూరు

రానున్న ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలని సిఐ కె.గోవింద్‌రాజు ఓటర్లకు సూచించారు. మండలంలోని పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్ గ్రామాల్లోని అంగజాలపాలెం, తెన్నేటిపేట, కపురువారిపాలెంలో సిఐఎస్ఎఫ్, సివిల్ పోలీసులు సోమవారం కవాతు చేశారు. ఈ సందర్భంగా సిఐ గోవింద్‌రాజు మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జర్నాల్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ రామాన్ జి, మొగల్తూరు ఎస్ఐ కె.వెంకటరమణ, తహశీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.



మొగల్తూరు : కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రచార మాధ్యమాల అడ్మిన్లు అప్రమత్తంగా ఉండాలి

పాలకోడేరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రచార మాధ్యమాల అడ్మిన్లు అప్రమత్తంగా ఉండాలని పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని గొల్లలకోడేరు, కుమదవల్లి గ్రామాల్లో ఎన్నికల అవగాహనా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాట్సాప్, ఫేస్బుక్, ఇన్‌స్టాగ్రామ్, తదితర సోషల్ మీడియా అడ్మిన్లు ఎన్నికల నేపథ్యంలో తగిన సూచనలు పాటించాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగభూషణం నాయుడు, విఆర్ఓ సుబ్రహ్మణ్యం, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పెదపుల్లేరులో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఉండి

రోజురోజుకీ పెరుగుతున్న వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించి పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పెదపుల్లేరు గ్రామ రెవెన్యూ అధికారి సబ్బవరపు దాసు అన్నారు. మండలంలోని పెదపుల్లేరు గ్రామంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్బవరపు దాసు మాట్లాడుతూ రోజురోజుకీ ఎండ తీవ్రత పెరుగుతుందని, ప్రతిఒక్కరూ ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పొలం పనులు ముగించుకుని ఎండలో వెళ్లే రైతులు, వాహనదారులను దృష్టిలో పెట్టుకుని చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు చిన వీరభద్రరావు

ప్రజాశక్తి - తణుకు రూరల్

50 ఏళ్లు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి రూ.5వేలు వృద్ధాప్య పింఛన్ అందిస్తామని అన్ని రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో ప్రకటించాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక పార్వతిదేవి ఆలయ ప్రాంగణంలో యూనియన్ ఉపాధ్యక్షులు వాటాల నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడం వల్ల ఉక్కపోతతో పాటు ఎక్కువగా ఉండడంతో భవన నిర్మాణ కార్మికులు వడదెబ్బ బారిన పడి తీవ్రమైన అనారోగ్యానికి గురవ్వడంతో పాటు అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దీంతో ఆ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో వీధిన పడుతున్నాయన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి సంక్షేమ పథకాల అమలు కోసం కార్మికులు అనేక ఏళ్లు పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ సంక్షేమ బోర్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం చేశాయన్నారు. దీంతో సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు ప్రమాద బీమాతో పాటు ఇతర సంక్షేమ పథకాలు ఏమీ అమలు కావడంలేదన్నారు. దీంతో కార్మిక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలన్నీ కార్మికులకు అండగా ఉన్న సంక్షేమ బోర్డును పునఃప్రారంభించి 50 ఏళ్లకే పెన్షన్, డెలివరీ పారితోషకాలు, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలు తిరిగి అమలు చేస్తామని, కార్మికులను ఆదుకుంటామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొరపల్లి రామకృష్ణ, మల్లాడి మాధవకృష్ణ, కరేళ్ల అర్జున్, నేరెళ్ల మల్లికార్జునరావు, యాతం పెద్దరాజు, దున్నే రుద్రనాగేశ్వరరావు, ఆనందం గంగాధరరావు, యాతం శ్రీను పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో శివరామరాజు పర్యటన

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని బొండాడపేట, బొండాడ, ఎల్ఎన్.పురం, ఆనందపురం, మాలవానితిప్ప, బోస్‌కాలనీ గ్రామాల్లో మాజీ ఎంఎల్ఎ, ఉండి స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి వేటుకూరి వెంకటశివరామరాజు (కలవపూడి శివ) సోమవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి ఆటోలో తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఏగా ఉన్నప్పుడు ఆక్వా రైతుల అభ్యున్నతికి కృషి చేశానన్నారు. రెండు సార్లు ఎంఎల్ఏగా చేశానని, మరోసారి గెలిపించాలని కోరారు. బొండాడలో పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవం సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు. శివరామరాజు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ ప్రచారంలో కలవపూడి సర్పంచి గేదల జాన్, మాజీ సర్పంచి గుడ్ల మోహన్‌రావు, దాసరి రాజు, రెడ్డిపల్లి జనార్దన్, వేగేశ్న బాలగణపతివర్మ, ముదుండి మణిబాబు, అల్లూరి అచ్యుతరామరాజు, బొక్కా నరసింహస్వామి, ఉబ్బా అచ్చన్న, కొరసేక నాగరాజు, సీతారామస్వామి, ఏడుకొండలు, సైదు పెద్దిరాజు, గొట్టుముక్కల బలరామకృష్ణంరాజు, వేగేశ్న ప్రసాదరాజు, ముదుండి శ్రీనివాసరాజు, లంకపల్లి జ్ఞానరాజు, మోకా నరసింహస్వామి, పత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.


ఆటోలో ఎన్నికల ప్రచారం చేస్తున్న శివరామరాజు

వైసిపికి దళితులే గుణపాఠం చెప్పాలి : ఎంఎల్ఎ నిమ్మల

పాలకొల్లు రూరల్ : వైసిపి ప్రభుత్వానికి దళితులే గుణపాఠం చెప్పాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని వెలివెల గ్రామంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సోమవారం ప్రచారం నిర్వహించారు. తొలుత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరున ఉన్న విదేశీ విద్య పథకానికి జగన్ తన పేరు పెట్టుకున్నారన్నారు. గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లు, సీట్లు ఇచ్చిన దళితులనే జగన్ విస్మరించారన్నారు. వైసిపి పాలనలో రద్దు చేసిన దళిత పథకాలన్ని రానున్న తమ ప్రభుత్వంలో పునరుద్ధరిస్తామన్నారు. టిడిపి హయాంలోనే గొల్లగూడెం, పుచ్చలగుంట చెరువు, కల్లవారిపాలెం పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు తాను చేసినవేనన్నారు. ఈ ప్రాంతంలో వంతెన, రేవులు, విద్యుత్, డ్రెయినేజీ వంటి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడుతూ ఎంఎల్ఎ రామానాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పలువురు దళిత నేతలు, గ్రామ ప్రముఖులు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కండిపోయిన నాగేశ్వరరావు, కోటి రాంబాబు, కండిబోయిన నాగరాజు, దొమ్మేటి ఏసుదాసు, డాక్టర్ శివ, బందుల ఆశీర్వాదం, కండిబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రచారంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని తీర్చడం మాత్రమే తనకు తెలుసని, గత 30 ఏళ్లుగా తమ కుటుంబం ప్రజాసేవలో ఉందని వైసిపి భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన సుమారు వందమంది టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో సోమవారం వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నిత్యం ప్రజా సేవలోనే ఉన్నానన్నారు. భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న తనకు అండగా ఉండేందుకు ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువత నాయకులు గ్రంధి రవితేజ, నాయకులు ఉద్దరాజు రాజేష్‌వర్మ, గూనబోయిన గంగరాజు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'మనకోసం మన నాయకర్'

ప్రజాశక్తి - మొగల్తూరు

రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమి విజయం సాధించడం ఖాయమని జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని కోమటితిప్ప, నీటితిప్ప గ్రామాల్లో మనకోసం మన నాయకర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను వైసిపి ప్రభుత్వం సమస్యల సుడిగుండంలో పడేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పొత్తూరి రామరాజు, చాగంటి మురళీకృష్ణ (చిన్న), కొల్లాటి గోపీకృష్ణ, వలవల నాని, గుబ్బల నాగరాజు, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, శ్రీను, గుబ్బల మార్రాజు, పులపర్తి సుబ్రహ్మణ్యం, మేడిది ప్రభాకర్, వనమాల శ్రీను, డి.బాబ్జి, ఆకుల శ్రీనివాస్, తోట నాని, పోలిశెట్టి నళిని, కంచర్ల పుష్ప, బసవాని నాగమణి, గ్రంధి నాని పాల్గొన్నారు.


ప్రచారంలో బొమ్మిడి నాయకర్

వాలమర్రులో గుడాల గోపీ ప్రచారం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని వాలమర్రులో వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు తన భార్య మంగతాయారు, కుమారుడు సాయిబాలాజీ కలిసి సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుడాల గోపీ మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తినని, తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం వాలమర్రు గ్రామంలో 30 మంది గోపీ సమక్షంలో వైసిపిలోకి చేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గంటా సత్యనారాయణ, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, మండల కన్వీనర్ విపర్తి ప్రభాకర్, ఉప సర్పంచి దాసరి రమేష్, వేండ్ర సింహాచలం పాల్గొన్నారు.


ప్రచారంలో గుడాల గోపీ

IN THE COURT OF THE 1ST ADDL. SENIOR CIVIL JUDGE : KAKINADA

O.S. No. 122/2022

Between :
GOTTUMUKKALA RAMACHANDRA RAJU ...Plaintiff
and
BALLA SIVA KUMAR & OTHERS ...Defendants

To, 3rd Defendant :
Pedamallu Naga Venkata Satya Manikanta Gupta
S/o. Madhavarao, Aged 32 Years,
D.No. 2-80, Valamarru Village,
Palakollu Mandal,
West Godavari District.

పై నెంబర్ దావా యందు 3వ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా రిజిష్టర్ పోస్టు మరియు దావా సమన్లు పంపించినను ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోకుండా త్రిప్పిపంపించుచున్నారు. కావున సదరు దావా సమన్లు అమలు నిమిత్తం **ది. 15-04-2024 సం॥ తేదీన** వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా రోజున **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టువారి ముందు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలను తెలియపర్చుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్పు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం)
వేమూరి చంద్రమౌళి
వాది తరపు న్యాయవాది
డో.నెం. 67-7-4/7ఎ, ఆంధ్రా బ్యాంక్ దగ్గర,
అశోక్ నగర్, కాకినాడ - 3,
ఫోన్: 0884-2343562, 9849545912

4న పాఠశాల వార్షికోత్సవం

పెనుమంట్ర: మండలంలోని పొలమూరు శివారు నాగళ్లదిబ్బ మండల పరిషత్ రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఈ నెల నాలుగో తేదీ గురువారం నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్ఎం కెఎన్‌వి.శ్రీనివాస్ తెలిపారు.

CHANGE OF NAME

I, **MOHAMMAD SABIHA BEGUM** W/o. Mohammad Jilani, D.No.11-1-70/P, Near Church, Darga Street, Narasapur, W.G.Dt., A.P. I have changed my name from **MAHAMMAD SABBIHA BEGUM** (Old name) to **MOHAMMAD SABIHA BEGUM** (New name) hence forth I am being called **MOHAMMAD SABIHA BEGUM** W/o. Mohammad Jilani, for all purposes.

పాస్‌పోర్టు పోయినది

గణపవరం మండలం, కొమ్మర గ్రామమునకు చెందిన కవల దినేష్ సాయిగోపాల్, తండ్రి: వెంకట సుబ్బారావు అను నేను కొమ్మర నుండి గణపవరం వచ్చి నా యొక్క పాస్‌పోర్టు నెంబరు **S7077980** పాస్‌పోర్టును జిరాక్స్ తీయించుకుని జిరాక్స్ మరియు ఒరిజినల్ పాస్‌పోర్టును కవర్లో పెట్టుకుని బండిపై గణపవరం నుండి కొమ్మర వెళ్లే దారిలో కవర్‌తో సహా మార్గ మధ్యలో పడిపోయినది. దారిలో ఎంత వెతికిన దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కవల దినేష్ సాయిగోపాల్
తండ్రి: వెంకట సుబ్బారావు
కొమ్మర గ్రామం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా, సెల్: 9515300377

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు

ఓ.ఎస్. నెం. 179/2017

శ్రీ పెనుగంటి వెంకట రాంబాబు **-వాది**
మరియు
జిల్లా కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా
ఏలూరు, వగైరా **-ప్రతివాదులు**

పై నంబరు దావాలో 10వ ప్రతివాది శ్రీ పిల్లా తాతబ్బాయి చనిపోయినందున అతని వారసులుగా శ్రీమతి పిల్లా సత్యవతి (డి617), కుమారి పిల్లా వరలక్ష్మి (డి-18) మరియు కుమార్తె పిల్లా రూపశ్రీ (డి-19) లను ప్రతివాదులుగా చేర్చినారు. వారిలో 18 మరియు 19 ప్రతివాదులు మైనర్లు అయినందున 17వ ప్రతివాదిని గార్డియన్‌గా నియమించని పిటిషన్ దాఖలు చేసినారు. సదరు పిటీషనులో మరియు దావాలో 20వ ప్రతివాది - శ్రీ పిల్లా నాగేశ్వరరావు మరియు 21వ ప్రతివాది శ్రీమతి యల్లపు కన్యాకుమారి గారలకు నోటీసులు ఈ ప్రకటన ద్వారా ఆర్డరు చేసినారు, వాయిదా ది. 29-04-2024.

కాబట్టి పై నంబరు దావాలో 17 నుండి 21 ప్రతివాదులు పై కోర్టు వారి ఎదుట ది. 29-04-2024వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్సుపార్టీ చేసి దావా ముందుకు నడుపబడును. 18 మరియు 19 ప్రతివాదులకు కోర్టు గార్డియన్‌ను నియమించెదరు.

ఏలూరు **ఎస్.వి.ఆర్.గాంధీ**
ది.28-03-2024 వాది తరపున అడ్వకేట్

PUBLIC NOTICE

In the Court of the Honourable Special Judge for Trail of offences against Women-Cum-V Additional District and Sessions Judge, Eluru

Appeal Suit No. 133/2023
in
O.S. No. 138/2016

(In the Court of the Hon'ble Principal Senior Civil Judge Eluru, West Godavari)

Between:
Sri Meka Gandhi ...*Appellant*
AND
1. Smt. Gurram Dhanalakshmi
2. Gurram Nagaraju
3. Gurram Peddiraju
4. Gurram Venkanna Babu
5. Ibba Tirapataiah
6. Ibba Sreenu
7. Gandru Venkanna Babu
8. Gandru Durga Rao ...*Respondents*

To:
R-7: Dandru Venkanna Babu, S/o. Not known, Hindu, Dr.No. 1-20-10/2, Ramaraopeta, Tadepalligudem West Godavari District.

R-8: Dandru Durga Rao, S/o. Not known, Dr.No. 1-20-10/2, Ramaraopeta, Tadepalligudem, West Godavari District.

Please take notice that the supra mentioned case stands posted **to 22-04-2024, at 10.30 A.M.,** for your appearance. If you failed to appear before the said Hon'ble Court, the matter will be decided in your absence.

//By Order of the Court//

GOTTUMUKKALA RONALD RAJU
Eluru Advocate, High Court of AP & TS
Date:01-03-24 Eluru, Cell: 9440375533

PUBLIC NOTICE

In the Court of the Honourable Special Judge for Trail of offences against Women-Cum-V Additional District and Sessions Judge, Eluru

I.A. No. 66/2023 in
Appeal Suit No. 133/2023 in
O.S. No. 138/2016

(In the Court of the Hon'ble Principal Senior Civil Judge Eluru, West Godavari)

Between:
Sri Meka Gandhi ...*Appellant*
AND
1. Smt. Gurram Dhanalakshmi
2. Gurram Nagaraju
3. Gurram Peddiraju
4. Gurram Venkanna Babu
5. Ibba Tirapataiah
6. Ibba Sreenu
7. Gandru Venkanna Babu
8. Gandru Durga Rao ...*Respondents*

To:
R-7: Dandru Venkanna Babu, S/o. Not known, Hindu, Dr.No. 1-20-10/2, Ramaraopeta, Tadepalligudem West Godavari District.

R-8: Dandru Durga Rao, S/o. Not known, Dr.No. 1-20-10/2, Ramaraopeta, Tadepalligudem, West Godavari District.

Please take notice that the supra mentioned case stands posted **to 22-04-2024, at 10.30 A.M.,** for your appearance. If you failed to appear before the said Hon'ble Court, the matter will be decided in your absence.

//By Order of the Court//

GOTTUMUKKALA RONALD RAJU
Eluru Advocate, High Court of AP & TS
Date:01-03-24 Eluru, Cell: 9440375533